క్లుప్తంగా

పెద్దేముల్ ఏఈగా రఘువీర్



పెద్దేముల్: మండల విద్యుత్ ఏఈగా రఘువీర్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన సందీప్‌కుమార్ వికారాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో సుమారు రెండేళ్ల వరకు ఇన్‌చార్జి ఏఈలతో కొనసాగింది. ఈ రెండేళ్లలో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో ఏ సమస్య ఉన్నా, తాండూరు ఏడీ ఆదినారాయణకు రైతులు, వినియోగదారులు ఫోన్ చేసి చెప్పేవారు. ఇన్‌చార్జి ఏఈలు ఉన్నా వారు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. దీంతో ఉన్నతాధికారులు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో పని చేస్తున్న రఘువీర్‌ను పెద్దేముల్‌కు బదిలీ చేయడంతో అటు అధికారులు, ఇటు రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా రాజునాయక్



నియామక పత్రం అందుకుంటున్న రాజునాయక్

ధారూరు: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అసంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జిలను బీజేపీ నియమించింది. ఇందులో భాగంగా వికారాబాద్ శాసనసభ ఇన్‌చార్జిగా ధారూరు మండల పరిధిలోని దోర్నాల్ తండాకు చెందిన ధారూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజునాయక్‌ను మంగళవారం నియమించింది. ఈ మేరకు బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించి చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని రాజునాయక్ అన్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు



చేతిపంపునకు కట్టేసిన మేకలు

బొంరాస్‌పేట: ఊట చెలిమెలు, మోటబావులు, చేదుడుబావులు, చేతిపంపులు ఇలా తాగునీటి వనరులు కాలగమనంలో మారతున్నాయి. ఇంటింటి నల్లాకు ముందు ఇవన్నీ తాగు నీటినందించాయి. ఆధునిక కాలంలో చేతిపంపులు చాలా సురక్షింతంగా దాహం తీర్చాయి. అలాంటి చేతిపంపులు భూగర్భ జలం అడుగంటడంతో ఇలా ప్రతి చోట నిరుపయోగంగా మారాయి.

ప్రజాభీష్టం మేరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

- ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

తాండూరు టౌన్ : పాత తాండూరు ప్రజల అభీష్టం మేరకు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్‌లకు లేఖ రాశారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లు, ఆస్తి నష్టం వాటిల్లుతోందన్నారు. అంతే కాకుండా బ్రిడ్జి నిర్మాణానికి అత్యధిక వ్యయం అవుతోందన్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అత్యధిక శాతం మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, దానికి బదులుగా అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వే స్టేషన్‌లో రైలు నంబర్ 17319, 17320 హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, రైలు నంబర్ 12793 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ డీఆర్ఎం హైదరాబాద్‌కు సూచనలు చేసి సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు కొండా పేర్కొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువు రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి నడవడికలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు



బొంరెడ్డిపల్లిలో కృత్రిమ ఇసుక తయారీ కేంద్రం



ఇసుక తరలించేందుకు సిద్ధంగా ట్రాక్టర్



ఇప్పాయిపల్లి చెరువులో ట్రాక్టర్‌లోనే ఫిల్టర్ ఇసుక తయారీ

- కృత్రిమ ఇసుక కేరాఫ్ బొంరెడ్డిపల్లి
- నిబంధనలకు నీళ్లు
- ఎక్కడ చూసినా కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ఇసుక అక్రమ రవాణా మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. కుల్కచర్ల మండలపరిధిలోని పలు గ్రామాల్లో కృత్రిమ ఇసుక రవాణా ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. కృత్రిమ ఇసుక తయారు చేయడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ నిబంధనలను పట్టించుకోకుండా సంపాదనే ధ్యేయంగా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇసుక తయారీకి అడ్డాగా బొంరెడ్డిపల్లి

కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారుగా 10 ప్రాంతాల్లో కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. వీరిలో కొందరిపై కేసులు నమోదైయ్యాయి. అయినా మళ్లీ అదే దారి అక్రమంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. కొందరు రాత్రే చాలు తమ దినచర్యలో భాగంగా ఇసుక అక్రమంగా తరలిస్తూ అక్రమార్జన పొందుతున్నారు. మట్టిని తవ్వి ఒక గుంతలో నీటితో ఫిల్టర్ చేయడం ద్వారా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. మండల కేంద్రానికి 2కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక గ్రామంలో దర్జాగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. బొంరెడ్డిపల్లి గ్రామంతో పాటుగా అనంతసాగర్, అంతారం, కుస్మసముద్రం, ఇప్పాయిపల్లి గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కృత్రిమ ఇసుక తయారీ, రవాణాను ఆపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



చట్టవిరుద్ధమైన పనులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. బొంరెడ్డిపల్లి గ్రామంలో కృత్రిమ ఇసుక తయారీ, రవాణా చేయడంపై విచారించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

– మురళీధర్, తహసీల్దార్ కుల్కచర్ల

శ్రీరామ నవమికి సర్వం సిద్ధం

ఆలయాలు ముస్తాబు



తిర్మలాపూర్‌లో ముస్తాబైన దేవాలయం

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రముఖంగా బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో, కుల్కచర్ల ఆంజనేయస్వామి దేవాలయంలో, పుట్టపహాడ్ కోదండ సీతారాముల వారి ఆలయంలో, చౌడాపూర్‌లో సీతా సమేత రామాలయంలో, మరికల్‌లో, ముజాహిద్‌పూర్ గ్రామంలో, పీరంపల్లి గ్రామంలో రాములోరి కల్యాణం నిర్వహించేందుకు ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

కొడంగల్‌లో..

కొడంగల్ : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం 12.01 నిమిషాలకు కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్, కుదురుమళ్ల, గోకఫసల్‌వాద్ గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం సుప్రభాతం, కలశస్థాపన, పంచామృతాభిషేకం, కల్యాణోత్సవం, నైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ననున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితతిరుపతయ్యలు అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లిలో రెండురోజులుగా బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెండోరోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొని పూజలు చేశారు. అనంతరం టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లు వారిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉత్సవాలను కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీ రవి, శ్రీకాంత్, మల్లేశ్, బాల్‌రాజ్, భీమయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, బాలకృష్ణారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు
- ప్రజలు ఉక్కిరిబిక్కిరి



జన సంచారం లేక బోసిపోయిన తాండూరు- సంగారెడ్డి రోడ్డు

పెద్దేముల్: ఉ.9 గంటల నుంచి భానుడి భగభగలతో జనం అల్లడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లే దినసరి కూలీలు ఉ.10 గంటలకే ఇంటి బాటపడుతున్నారు. భానుడి భగభగలతో మండలం నిప్పుల కొలిమిలా మారుతుంది. ఎండల దెబ్బకు జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండలు మండిపోతున్నాయి. రాత్రి 7.00 గంటలు దాటినా వాతావరణంలో వేడి తగ్గక జనాలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పరిస్థితి ఇలా ఉంటే మే నెలల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది సుమారు 40 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది 42కు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు సమాచారం. మధ్యాహ్నం అయితే చాలు జనాలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. రద్దీ మార్గాలు నిర్మానుషంగా మారుతున్నాయి. మండలంలో తాండూరు- హైదరాబాద్, తాండూరు-సంగారెడ్డి మార్గాలు నిర్మానుషంగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ఆటోలు, బస్సులపై ప్రయాణం చేస్తున్నారు. ఎండల ప్రభావంతో మార్కెట్‌ల్లో కొబ్బరి బోండాలు, శీతలపానీయాలు, మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు, జ్యూస్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎండకాలం ప్రారంభం కావటంతో పలు గ్రామాల్లో చిన్న చిన్న వ్యాపారస్తులు జ్యూస్ బండ్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



పరిగి: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తాండూరు టౌన్ : వేసవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ నాగార్జున సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాజీవ్‌కాలనీ వాసులకు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంట గదిలో గ్యాస్ సిలిండర్ వల్ల అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలు, షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే ప్రమాదాలు నివారణ చర్యలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎఫ్ఎస్ఓ నాగార్జున మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది గోపాల్, రఘుపతి రెడ్డి, నర్సింహులు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పరిగి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పరిగి పట్టణ కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అందుకు పట్టణ కేంద్రంలో అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహించి, కళ్లకు కట్టినట్లు చూయించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలు తిరిగే ప్రదేశాల్లో షాపింగ్ మాల్‌లో తప్పకుండా ఫైర్ సెఫ్టిని పాటించాలని అగ్ని మాపక సిబ్బంది సూచించారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



మాజీ సర్పంచ్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామరగిద్ద, ఊరెళ్ల గ్రామాల మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, జాహంగీర్, సింగప్పగూడ సీనియర్ నాయకుడు అలీ మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు.వారికి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వసంతం, ఇతరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఆరోగ్య శిబిరం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ శివారులోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న బాలికల గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడిక్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న 302 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేసి, అవసమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా, శ్వేత, స్టాఫ్‌నర్స్ దీపిక పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



పరిగి: ఎస్ఐకి పండ్లు అందజేస్తున్న డీఎస్పీ, సీఐ



దోమ : శ్రీకాంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్ఐ ఆనంద్‌కుమార్

పరిగి: రక్తదానంతో ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. పరిగి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఏబీఎస్ ప్లాజాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బంది, యువకులు పాల్గొని 233 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో రక్తం ఎంతో విలువైందన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాటితో వారికి కావాల్సిన రక్తం సమయానికి అందక మృతి చెందుతున్నారన్నారు. ఇప్పుడు మీరు ఇస్తున్న రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తం ఇవ్వడం ద్వారా ఎలాంటి ప్రమాదం లేదని, ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు యువకులు రక్తదానం ఇచ్చే అవసరం ఉంటే ముందుండి దానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

దోమ : అత్యవసర సమయాల్లో రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దోమ ఎస్ఐ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పరిగి పట్టణంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి ఆయన హాజరై రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానంలో ముందుండాలని పిలుపునిచ్చారు. రక్తం లేక ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని, సరైన సమయంలో రక్తం ఎక్కించగలిగితే ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో మొదటి గంటలో రక్తం ఇవ్వగలిగితే చాలా వరకు ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన శ్రీకాంత్‌రెడ్డికి ఎస్ఐ ఆనంద్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువకులు, తదితరులు పాల్గొన్నారు.

కోస్గిలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు

కొడంగల్ : నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 20 నుంచి మే 20 వరకు నెల రోజుల పాటు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. బాలురు, బాలికలు అర్హులన్నారు. విడివిడిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అండర్ 14, అండర్ 16, అండర్ 19, ఓపెన్ విభాగాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు 97106 99088 నంబర్‌పై సంప్రదించాలన్నారు.

కుల్కచర్లలో 16 వరి కొనుగోలు కేంద్రాలు

కుల్కచర్ల: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని కుల్కచర్ల మండల వ్యవసాయాధికారి వీరస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో 16 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని కొత్తపల్లి, మరికల్, తిర్మలాపూర్, బండవెల్కిచర్ల, చౌడాపూర్, అడవివెంకటాపూర్, ఇప్పాయిపల్లి, కుల్కచర్ల, కుల్కచర్ల(ఐకేపి), సాల్వీడు, ముజాహిద్‌పూర్, కుస్మసముద్రం, కల్మన్‌కాల్వ, అనంతసాగర్, మల్కాపూర్, చాకల్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న నాయకుడు



చటారి దశరథ్‌ను ఆశీర్వదిస్తున్న కేసీఆర్

చేవెళ్ల: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి, ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. చేవెళ్ల మండలానికి చెందిన దశరథ్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయన కేసీఆర్‌ను కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనకు కండువా కప్పి ఆశీర్వదించారు.

కనుల పండువగా ఎదురుకోళ్లు



మండల కేంద్రంలో ఎదురుకోళ్లు కార్యక్రమం

బొంరాస్‌పేట: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని భక్తసమాజం వద్ద సీతారామ సేవా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాములోరి కల్యాణాన్ని రమణీయంగా జరిపేందుకు సిద్ధమైనట్లు పురోహితుడు సత్యనారాయణ జోషి చెప్పారు. మంగళవారం సాయంత్రం ప్రధాన కూడలిలోని భూలక్ష్మి ఆలయం నుంచి ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రధానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం వచ్చే ఏడాది కార్యక్రమాలపై వేలం, వీధుల్లో శోభాయాత్ర ఉంటుందని పురోహితుడు సత్యనారాయణ జోషి తెలిపారు. అలాగే బురాన్‌పూర్, రేగడిమైలారంలో భగవద్గీత పఠనం ముగింపు, అన్నదానం కార్యక్రమాలు, దుద్యాల మండల కేంద్రంతో పాటు హకీంపేట, లగచర్ల గ్రామాల్లో రామనవమి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు.

వీధి నాటకాలను ప్రోత్సహించాలి

జెడ్పీటీసీ నాగిరెడ్డి



వీధినాటక కళాకారులకు విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: ప్రాచీన కాలంనాటి వీధి నాటకాలు గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రోత్సహించాలని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలంలోని ఊటుపల్లి గ్రామంలో జరుగుతున్న మహా రామాయణం వీధి నాటకానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పేద కుటుంబాలు వీధి నాటకాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీన కళలను తాను ప్రత్యేక్షంగా వీక్షించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కళాకారులకు రూ. 10 వేల విరాళం అందజేశారు. మరో పక్క ఎంపీపీ తనయుడు పటోళ్ల రాఘవేందర్‌రెడ్డి వీధినాటకాలను రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు మశ్చందర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



ఆలయంలో పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

షాబాద్: కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీం భరత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయంలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామం నుంచి దేవాలయం వరకు కలిపే రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, మల్లేశ్, నాయకులు సుభాష్, చెన్నయ్య, నర్సింలు, రవీందర్, వెంకటయ్య, మల్లేశ్, యాదయ్య, రాంచందర్, సత్తయ్య, అక్తర్ పాషా తదితరులున్నారు.